# కాలమే సమాధానం చెప్పాలి!

## రేణుక అయోల

రిక్షా రోడ్డు మీద వెళుతోంది, బెల్లుకి బదులు కర్రని రోడ్డు మీద కొడుతూ ట్రాఫిక్‌ని ఛేదించుకుంటూ, రివ్వున సాగిపోతూంది.

అలా రిక్షాలో కూర్చుని వెళ్లడం నాకు సరదా. ముఖ్యంగా రిక్షా తొక్కే వీరయ్య నాకు మంచి స్నేహితుడు. వాడి దగ్గర ఉన్నంత సమాచారం బహుశా పేపర్లవాళ్లు కూడా ఇవ్వరు.

వాడితో మాట్లాడ్డం అంటే ఇష్టం, కాని భార్య, పిల్లలు విసుక్కుంటారు. ఇంట్లో కారు (డ్రైవర్ని) వదిలేసి రిక్షాలో తిరుగుతారు, ఈ మహానుభావుడికి ఇదే పిచ్చో?! అనుకుంటూ...

సాయంకాలాలు అలా రోడ్డు మీదకి వస్తే చాలు, 'అయ్యగారూ' అంటూ పరిగెత్తుకుంటూ వస్తాడు రిక్షాతో పాటు. 'ఎందుకలా అంత తొందర? నీ రిక్షా తప్పించి ఎవరిదీ ఎక్కనుగా!'

'ఏమో బాబుగారూ, మీరు ఇబ్బంది పడిపోతారనీ' అనే వాడు గాని, వాడి భయం నాకు తెలుసు వాడి గిరాకిని ఇంకెవరైనా తీసేసుకుంటారని.

వాడు పొరపాటున సాయంకాలం ఇంకెక్కడికైనా వెళ్లవలసి వస్తే, వాడికి తెలిసిన, బాగా నమ్మకం ఉన్న ముసలి రిక్షావాడికి అప్పచెప్పేవాడు. వంద జాగ్రత్తలు, రెండు వందల అప్పగింతలతో. ఆ ముసలాడు చెబుతుంటే నవ్వొచ్చేది.

అలా వాడితో నాకు అనుబంధం ఏర్పడిపోయింది. ఒక్కోసారి వాడు రిక్షా స్టాండులో లేకపోతే ఎక్కడికీ వెళ్లబుద్ధి అయ్యేది కాదు. అందుకే నున్న అంత దూరంలో నుంచి చూసి, ఆ స్టాండువాళ్లు వాడి సమాచారం చెప్పేవారు. వాడు ఊరికి వెళ్లాడనో, ఇంకేదనో... 'రమ్మంటారా అయ్యగారూ?' అంటూ ఆశగా చూసేవారు. అది కూడా వాడి ఆజ్ఞ తోటే, లేకపోతే పొట్లాట పెట్టుకుని, 'మీరు కనుక అయ్యగార్ని నాకు తెలియకుండా ఎక్కించుకుంటే నా మీద ఒట్టే' అంటూ నానా గొడవా చేస్తాడట. అందుకే అందిరికీ భయం. వాడు ఎక్కించుకోమంటే ఎక్కించుకుంటారు.


ఈ విషయం మా బంధువులందరికీ తెలిపి నవ్వుకుంటారు. చిన్న ఊరు కదా ఏ విషయమూ దాగదు మరి! ఆలోచనలో ఉన్ననాకు, రిక్షా వీరయ్య పిలుపుతో... అరె అప్పుడే పార్కు వచ్చేసిందా అనుకున్నాను. రోజూ సాయంకాలం ఈ పార్కుకి రిక్షాలో వస్తాను, అదీ సంగతి.

మళ్లీ నేను పార్కు నుంచి వచ్చేదాకా అక్కడే ఉంటాడు, పార్కులో అలా తిరిగి బెంచి మీద స్నేహితులతో బాతాఖానీ కొట్టి... మళ్లీ వాడి రిక్షాలో పోతాను. రిక్షా తొక్కుతూ 'బాబుగారూ, ఎందుకండీ, ఈ రిజరేసన్లు, కావాలని కొట్టుకుంటున్నారు, అసలు ఎనకబడిన ఆళ్లు అంటేనే పేదోళ్లు అని అర్థం కదండీ!! డబ్బు లేదు, పేదవాళ్లం, మాకు సదూకోడానికి డబ్బులు సాయం చేయండి అని అడుక్కోవాలి కాని, ఇందులో కూడా తేడాలు ఏంటండీ?' అన్నాడు

'ఏరా నువ్వెంత వరకు చదువుకొన్నావు ? నేను ఇన్నాళ్లు అడుగుదామనుకుంటూ మరచిపోతున్నాను' అన్నాన్నేను.

వాడు సిగ్గుతో 'వానాకాలం చదువులెండి, ఏడో క్లాసు దాక చదివాను. కానీ పేపరు చదవడమంటే మా చెడ్డ ఇట్టం' అన్నాడు.

'ఇదివరకు గ్రామాలలో కులవృత్తికి ఎంతో ఆదరణ ఉండేది. అందుకని వారు వారి వృత్తులలో సంతృప్తిగా ఉండేవారు,



హాయిగా, గౌరవంగా బతికేవారు. కాలం మారింది, వృత్తులకి ఆదరణ, పోషణ తగ్గిపోయాయి. అందరూ వీధిన పడ్డారు.

'అప్పట్లో బట్టలు ఉతకాలంటే చాకలివాళ్లే ఉతికేవారు, ఇంట్లో ఉతుక్కోవటం అసలు ఎవరికి తెలిసేది కాదు. క్రాపు చెయ్యాలంటే మంగలివాళ్లు వచ్చేవారు. శనివారం ఒంటికి నూనెరాసి, మర్దనా చేసి, క్రాపు చేసి, గోళ్లు తీసి. తన పని తాను చేసుకొని పోయేవాడు. వాడు లేకపోతే ఆ పని ఇంకొకరు చేసేవారు కాదు. వాడికా స్థానం ఉండేది.

'ఇప్పుడలా కాదుగా. ఎవరు ఏ పని నేర్చుకుంటే వారు ఆపని చేస్తున్నారు. వృత్తిని నమ్ముకొని తరతరాలుగా ఆ పని తప్ప ఇంకోపని చేయడం చేతకానివాళ్లు రోడ్డున పడ్డారు. అందుకే వాళ్లు మాది ఫలానా తెగ అంటూ చెప్పుకోవలసి వస్తుంది.

'అదే అదనుగా తీసుకొని, రాజకీయం వాటికి ఇంకో రంగు పులిమి తోలుబొమ్మలని చేసి ఆడిస్తుంది.

'ముఖ్యంగా విద్యార్థులలో ఇలాంటి సమస్యలు ఎక్కువైపోయాయి. ఉచితభోజనం, చదువుకోవడానికి ఉచితం... ఎంత తక్కువ మార్కులు వచ్చినా, ఎంత పెద్ద చదువులైనా చదువుకోవడానికి అవకాశం... ఇలాంటివాటి వలన వాళ్లలో తగాదాలు పెరిగిపోయాయి... వాటికోసం అక్రమాలు, అడ్డదార్లు వెదకడం మొదలు పెట్టారు' అన్నాను ఓ చిన్నపాటి ఉపన్యాసం ఇస్తూ...

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-**
**ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో**
**సాధారణప్రచురణకు స్వీకరించిన కథ**

'మరి ఎందుకండీ ఇన్ని గొడవలు, అసలు అందరికీ రిజరేసన్లు ఇచ్చేస్తే, అయిపోతుంది కదండీ!'

'ఏమిటి నువ్వంటున్నది, అందిరకీనా?' అన్నాను నవ్వుతూ.

'అవును బాబుగారూ, అందరికీ ఆళ్లు ఈళ్లు అని బాదలు లేకుండా అందరికీ ఇచ్చేత్తే సదువుకోనీయండి అందరినీ, అందరూ డాక్టర్లు, ఇంజనీర్లు అయిపోతారు కదాండీ!'

'భలేవాడివే అందరికీ ఉచితభోజనం, ఉచితంగా చదువు ఇస్తే ప్రభుత్వం దివాలా తీస్తుంది. అయినా సమస్యలుంటేనే కదా కొట్టుకుంటారు, అందరికీ రిజర్వేషన్లు ఇచ్చేస్తే ఇంకేం మిగిలిందీ? అప్పుడు కులాలు అంటూ ఏమీ మిగలవుగా. స్త్రీలు కూడా గొడవ పెడుతున్నారుగా. ఇప్పుడు వాళ్లు మాకు సమవాటా కావాలి, మాకు కొంత శాతం రిజర్వేషన్స్ కావాలి అంటారు. అది కూడా ఉండదు కదా!' అన్నాను వాడి మాటలకి జవాబిస్తూ, రిక్షా దిగి ఇంటి గేటు తీస్తూ.

ఇంటికొచ్చాక కూడా వాడి మాటలు నాకు నవ్వు తెప్పిస్తూనే ఉన్నాయి. ఎంత తేలిగ్గా చెప్పాడు అందరికీ రిజర్వేషన్లు ఇవ్వమంటూ, వాడంతే చాలా విషయాలు తమాషాగా మాట్లాడతాడు. 'అందరూ డాక్టర్లు, ఇంజనీర్లు అయిపోతే?! లేదా అందరూ అయిపోతారని తెలిస్తే... ఇన్ని పోటీలు ఎందుకు, ఇన్ని గొడవలు ఎందుకు? అందరూ హాయిగా నిశ్చయంగా తక్కువ మార్కులతో పెద్దపెద్ద చదువులు చదువుకోవచ్చు. బహుశా గొడవలు, ధర్మాలు, ఆత్మహత్యలు ఉండవు. కూరగాయల్లా కిలోల కొద్దీ మార్కులు తెచ్చుకున్న సరైన సీట్లు లభించక వేదనపడే విద్యార్థులంతా చాలా హాయిగా ఉంటారేమో!! అప్పుడది రామరాజ్యమా?!!

రైలు వెళుతూంది. అది ప్యాసింజర్ రైలు. విజయవాడ నుండి హైదరాబాద్‌కి. రైలు ఒక్క కుదుపుతో ఆగగానే, నిశ్చింతగా నిద్ర పోతున్న నేను ఉలిక్కిపడ్డాను. బాగా ఆకలిగా ఉంది, ఏదైనా కొనుక్కుందామని, బెర్తు మీద నుంచి కిందికి దిగబోతుంటే ఓ గుంపు విద్యార్థులు తెల్లకోట్లు వేసుకొని, మెడలో స్టెతస్కోపుతో, తోసుకుంటూ హడావిడిగా కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కుతూ...

'డాక్టరునండీ మీకు ఏదైనా జబ్బు ఉందా? చాలా చవకగా... ఎంతో చక్కటి వైద్యం అందిస్తాం' అంటూ వాళ్ల డిగ్రీలు, వాళ్లు చేసిన ఉద్యోగాలు, లభించక ప్రశంసలు అని ఓ కాగితంలో పొందుపరచి, పాంఫ్లెట్స్ పంచి పెడుతున్నారు.. నాకు కూలీ కూలీ అంటూ అరుస్తున్నట్లనిపించింది. నోరు తెరిచి చూస్తూ ఉండిపోయారు. వాళ్లని తప్పించుకొంటూ ఏదైనా కొనుకుందామని ప్లాట్‌ఫారం మీదకి దిగాను.

తినుబండారాల షాపుల పక్కనే వాటితో పాటుగా చిన్న చిన్న గుడారాలలో, సెల్ ఫోన్ వాళ్లు వేసుకునే టెంట్‌లాగా వేసుకొని, వాటి మీద కంప్యూటర్ ఇంజనీర్, మెకానికల్ ఇలా సబ్జక్టుకి ఒకరు చొప్పున అనే గుడారాలతో స్టేషన్ నిండా నిండిపోయాయి. ప్రయాణికుడు కనిపిస్తే చాలు పట్టుకుంటున్నారు మా దగ్గరికి రండి అంటూ... ఏదో ఒక పని ఇవ్వండి అంటూ... పోటీ... పోటీ... అక్కడ కూడా పోటీ పెరిగిపోయింది. ఎక్కడ చూసినా జలప్రవాహంలా నిరుద్యోగులు... ప్రయాణికుల కన్నా ఎక్కువగా నిరుద్యోగులు, ఉన్నతవిద్యలు చదివిన నిరుద్యోగులు.

ఎలాగో అలాగ అందర్నీ తప్పించుకొని రెండు ఇడ్లీలు, రెండు వడలు కొనుక్కొని, బ్రతుకు జీవుడా అనుకుంటూ కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చిపడ్డాను. ప్రయాణికులు అందరూ 'ముందు తలుపులు వేసేయండి, అందరూ వచ్చాక' అంటున్నారు కంగారుగా.

రైలు కదలగానే... భయంగా అడిగాను 'దోపిడీ దొంగలా, నక్సలైట్లా?' అని.

'వాళ్లైతే పరవాలేదండీ, దోచుకుంటారు పోతారు. కాని ఈ నిరుద్యోగులున్నారే డాక్టర్లమని, ఇంజినీర్లమని ప్రాణాలు తోడేస్తారు. డాక్టర్లయితే వాళ్ల క్లినిక్‌కి రమ్మని, ఇంజినీర్లయితే పని ఇప్పించమని ఇలా.'

'విదేశాల వాళ్లు తన్ని తగిలేశారుట. అక్కడా కూడా కిక్కిరిసిపోతున్న మనవాళ్లని చూసి బెంబేలెత్తిపోయి, అసలు అమెరికా అనే దేశమే లేదు పొమ్మంటున్నారట. అందుకే ముందు జాగ్రత్తగా తలుపులు వేసేస్తే కాస్తంత స్తిమితంగా భోజనాలు చేయవచ్చు.'

'హే భగవాన్!, వీరయ్యా నువ్వు తమాషాగా అందరికీ రిజర్వేషన్లు ఇవ్వకూడదా అన్నావు... దేశపరిస్థితి, నిరుద్యోగుల ఇక్కట్లు చూశావా?'

"నాన్నా, నాన్నా!" అంటూ చంటివాడు కుదిపి కుదిపి నిద్ర లేపాడు. వీరయ్య మాటలు, నాకొచ్చిన కల, అన్నీ కలిసి చికాకుగా అనిపించంది. వీరయ్య తమాషాగా అన్నా, ఒకవేళ అదే నిజమైతే దాని పరిణామాలు ఇంత దారుణంగా ఉంటాయేమో!

నిరుద్యోగులలో నిశ్చింత కన్నా పోరాటం ఎక్కువైపోయింది. డిగ్రీలు, ప్రొఫెషనల్ కోర్సులు ఎక్కడ చూసినా పోటీయే. ఈ నాటి దేశపరిస్థితి పోటీగా మారిపోయింది. అందుకే ఎల్.కె.జి., యు.కె.జి.ల దగ్గర నుంచి నిశ్చింత లేని చదువు... ఈ పోరాటం ఎప్పటికి ఆగుతుందో తెలియదు, లేదా వీరయ్య మాటలు భవిష్యత్తులో నిజమవుతాయా?! కాలమే సమాధానం చెప్పాలి. అనుకొన్నాడు విశ్వేశ్వరరావు.